పీవీకి భారతరత్న దేశానికే గర్వకారణం


పీవీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి

సనత్‌నగర్: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం దేశానికే గర్వకారణమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించిన సందర్భంగా ఎమ్మెల్సీ వాణీదేవి ఆధ్వర్యంలో బేగంపేటలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ప్రాంగణంలోని పీవీ నరసింహారావు భవన్‌లో శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముందుగా పీవీ నరసింహారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పీవీ ఫొటో ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా లభించిన గౌరవం భారతరత్న అన్నారు. విద్యా, ఉద్యోగ, వైద్య రంగాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కేసీఆర్ ప్రభుత్వం కూడా పీవీ నరసింహారావు శత జయంతిని సంవత్సరం పాటు ఎంతో గొప్పగా నిర్వహించి విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు, సముద్రాల వేణుగోపాలచారి, కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, సురభి రెనవబుల్ ఎనర్జీ డైరెక్టర్ శేఖర్ మారంరాజు పాల్గొన్నారు.

పల్స్ పోలియోకు సర్వం సిద్ధం

- అన్ని డివిజన్లలో కేంద్రాల ఏర్పాటు
- ఉ. 7 గంటల నుంచి సా. 6 వరకు అందుబాటులో సిబ్బంది



సనత్‌నగర్: పల్స్‌పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అమీర్‌పేట క్లస్టర్ పరిధిలోని సనత్‌నగర్, ఈఎస్‌ఐ, అమీర్‌పేట, పంజగుట్ట యూపీహెచ్‌సీ పరిధిలో సుమారు 22,905 మంది 0–5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధమయ్యారు. ఆయా యూపీహెచ్‌సీ పరిధుల్లో 134 పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు అమీర్‌పేట క్లస్టర్ సీనియర్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రేవతి తెలిపారు. యూపీహెచ్‌సీ సెంటర్లతో పాటు నేచర్ క్యూర్ రైల్వేస్టేషన్, అమీర్‌పేట మెట్రోస్టేషన్, బస్టాప్‌లలో ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే సెన్సిటివ్ ప్రాంతాలైన సనత్‌నగర్ దాసారం బస్తీ, శ్యామలకుంట, పంజగుట్ట ఎంఎస్ మక్తా ప్రాంతాలపై దృష్టి సారించి ఆయా బస్తీల్లో బూత్‌లను ఏర్పాటుచేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా భవన నిర్మాణాలు జరిగే ప్రాంతాలకు సమీపంలో కూడా తమ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. బూత్‌లతో పాటు మొబైల్ సిబ్బంది కూడా సేవలు అందిస్తారన్నారు. మొత్తం 536 మంది విధుల్లో పాల్గొంటారని ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఇంకా మిగిలిన వారుంటే 4, 5 తేదీల్లో ఇళ్ల వద్దకు వచ్చి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

తుకారాంగేట్, లాలాపేట పీహెచ్‌సీలలో..

లాలాపేట: అర్బన్ హెల్త్ పోస్టు తుకారాంగేట్, లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం పల్స్ పోలియో నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు లాలాపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోశీల్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లాలాపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 0- 5 ఏళ్ల చిన్నారులు దాదాపు 6034 మంది ఉన్నారని వీరికి పోలియో చుక్కలు వేసేందుకు 32 పోలింగ్ బూత్‌లను ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల వద్ద, కమ్యూనిటీ హాళ్లు, కాలనీ, బస్తీల్లో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు 138 మంది సిబ్బందిని నియమించామన్నారు.

31 కేంద్రాల్లో..

అడ్డగుట్ట: చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు తప్పనిసరిగా వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయి శంకర్ సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో పరిధిలో సుమారు 6,500 మంది పిల్లలు ఉన్నారని, వీరందరి కోసం మొత్తం 31 కేంద్రాల్లో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పాటు ఒక మొబైల్ టీమ్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

చైన్ స్నాచర్ రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు
వృత్తంలో నిందితుడు

చిలకలగూడ : ఒంటరి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ గిరిధర్, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, ఎస్‌ఐ ఆంజనేయులు వివరాల ప్రకారం.. పద్మారావునగర్ స్కందగిరి ఆలయ ప్రాంతంలోని ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న తుల్జాబాయి (80) గత నెల 28వ ఇంట్లో ఉండగా ఓ వ్యక్తి ప్రహరీ దూకి ఇంట్లోకి ప్రవేశించి తుల్జాబాయి మెడలోని బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా బయ్యారం జగ్లుతండాకు చెందిన బూక్యా కిరణ్ కుమార్ అలియాస్ చిట్టీ (28) కొంతకాలం క్రితం మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం దమ్మాయిగూడకు వలసొచ్చి ర్యాపిడో, ఓలా సంస్థలో టూవీలర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన కిరణ్‌కుమార్ చైన్ స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ర్యాపిడోకు వినియోగించే ద్విచక్ర వాహనంపై తిరుగుతు రెక్కీ నిర్వహించాడు. పద్మారావునగర్‌లో వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తున్నట్లు గుర్తించి, స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితుడు వినియోగించిన ద్విచక్ర వాహనం నంబరు గుర్తించారు. శనివారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై అటుగా వచ్చిన నిందితున్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



మహిళా దినోత్సవాలకు హాజరైన సౌమ్యా మిశ్రా, వినోద్ అగర్వాల్

సనత్‌నగర్: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే తాము ఎంచుకున్న రంగాల్లో అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యామిశ్రా అన్నారు. కోవె, యంగ్ ఇండియన్స్, సృష్టి సంయుక్తంగా బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో శనివారం మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సౌమ్యామిశ్రా మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అప్పుడే సాధికారత సాధ్యమవుతుందన్నారు. మహిళా సాధికారత వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ రిటైర్డ్ డీజీ వినోద్ అగర్వాల్ మాట్లాడుతూ.. కోవె సంస్థ మహిళల అభ్యున్నతికి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తోటి మహిళలకు తోడ్పాటునందించే విధంగా పారిశ్రామికవేత్తలు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుండడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు తదితర అంశాలపై ప్యానెల్ చర్చలు కొనసాగాయి. డాక్టర్ సౌజన్య, సుప్రీత, గీత గోటి, మాధవిలత కొంపెల్ల, రాజ్‌కుమార్‌లు పలు అంశాలపై మాట్లాడి అవగాహన కల్పించారు.

సమస్యలు గుర్తించారు.. పరిష్కారం చూపారు!

- ట్రాఫిక్ పోలీసుల చొరవతో తొలగిన సమస్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు


మురుగునీటి ప్రవాహాలతో మరమ్మతులకు ముందు ఒలిఫెంటా వంతెన రహదారి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఒలిఫెంటా వంతెన సమీపంలోని చిలకలగూడ కూడలిలో మురుగునీటి సమస్యకు పరిష్కార మార్గం లభించింది. రైల్వే ప్లాట్‌ఫామ్‌లు శుభ్రం చేసిన రసాయనాలు కలిసిన మురుగునీరు రహదారులపైకి వచ్చి చేరుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. సమస్యలను గుర్తించిన చిలకలగూడ పోలీసులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు ఇక్కడి పరిస్థితులను వివరించారు. ప్రత్యేకంగా రెండు కార్యాలయాలకు వెళ్లిన ట్రాఫిక్ పోలీసులు ప్రయాణికుల తరఫున వినతిపత్రాలను అందించారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులను ఒప్పించి ఒలిఫెంటా వంతెన–చిలకలగూడ ప్రధాన రహదారిలో ధ్వంసమైన పైప్‌లైన్‌ను తొలగించి కొత్తలైన్‌ను నిర్మించగలిగారు. ప్రస్తుతం ఈ ప్రధాన రహదారిపై మురుగనీటి ప్రవాహాలు లేవు, వాహనాల ప్రమాదాలు లేవు. ట్రాఫిక్ సమస్యలకు తెరపడింది. తమ విజ్ఞప్తిని పరిగణలోనికి తీసుకుని కొత్త డ్రైనేజీ లైన్‌ను నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించిన జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు.


ఫుట్‌పాత్‌పై పగిలిపోయిన టైల్స్

ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు చొరవతో..

సనత్‌నగర్: ఆ మార్గంలో ప్రతినిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా పాదచారులు రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సిందే. ఫుట్‌పాత్ ఉన్నా అక్కడక్కడ పాడైపోవడంతో పాదచారులకు రోడ్డే దిక్కవుతుంది. ఈ క్రమంలో అటు వాహనదారులు, ఇటు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఇక్కడి పరిస్థితిని గమనించిన నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ, టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు పాడైపోయిన ఫుట్‌పాత్ మరమ్మతులపై దృష్టి సారించి పరిష్కారానికి బేగంపేట ట్రాఫిక్ సీఐ పాపయ్య, ఆర్‌ఎస్‌ఐ మధుబాబును ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయంతో ఫుట్‌పాత్‌లపై ప్యాచ్ వర్క్ చేసి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో పనులు పూర్తయ్యేలా చూసిన సీఐ, ఆర్‌ఎస్‌లను ఏసీపీ శంకర్‌రాజు అభినందించారు.


శుభ్రంగా మారిన తర్వాత ఇలా..


మరమ్మతు తర్వాత ఇలా..

స్కాలర్‌షిప్‌ల విడుదలకు మంత్రికి వినతి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఫీజులు చెల్లించే ఆర్థిక స్తోమతలేని విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులు ఉత్తీర్ణులైన కాలేజీల నుంచి సర్టిఫికెట్లు తీసుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విడుదల వివిధ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు, ఉన్నత విద్యలను అభ్యసించే వారు బంగారం, ఇతర విలువైన వస్తువులను తాకట్టుపెట్టి సర్టిఫికెట్లను తీసుకుంటున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న నిధులను తక్షణం విడుదల చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

స్వల్ప అగ్నిప్రమాదం

రాంగోపాల్‌పేట్: మోండా సెకండ్‌బజార్‌లోని ఓ నాలుగు అంతస్తుల భవనంలో శనివారం ఉదయం స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. ఈ భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో సామగ్రికి నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు అంతస్తుల్లో ఉన్న వారిని అప్రమత్తం చేసి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

రూ.5 కోట్ల విరాళదాతకు 4న సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి రూ.5 కోట్లు విరాళం ఇచ్చిన పూర్వ విద్యార్థి గోపాల్ టీకే కృష్ణకు ఈ నెల 4న సన్మానించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కాలేజీ అసెంబ్లీలో జరిగే కార్యక్రమానికి అందురూ ఆహ్వానితులే అని అధికారులు తెలిపారు.

ఎలివేటెడ్ కారిడార్ల పట్ల సీవీఎం హర్షం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపట్టనుండటం పట్ల కంటోన్మెంట్ వికాస్ మంచ్ (సీవీఎం) నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కంటోన్మెంట్ వికాస్ మంచ్ సభ్యులు, సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిశారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పనులు చేపట్టేలా చూడాలని కోరారు. రోడ్ల అభివృద్ధి కోసం కంటోన్మెంట్ పరిధిలో సుమారు రూ.2 వేల కోట్ల విలువ చేసే 150 ఎకరాల స్థలం కేటాయించడం చరిత్రాత్మకం అన్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియను కూడా త్వరగా ముగిసేలా చూడాలని కోరారు. సీఈఓను కలిసిన వారిలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షులు జి. ఏబెల్, ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్, ప్రభుగుప్తా, అంబాల శ్రీనివాస్, మహ్మద్ షఫీ తదితరులున్నారు.

ఫుట్‌పాత్‌పై వృద్ధుడి మృతి

- మృతదేహాన్ని తీసుకెళ్లే స్తోమత లేదన్న కుటుంబీకులు
- మృతదేహం గాంధీ మార్చురీకి తరలింపు


మృతి చెందిన ఎర్రయ్య

రాంగోపాల్‌పేట్: 20 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లి ఇటీవల నగరానికి వచ్చాడు. ఫుట్‌పాత్‌పైనే జీవనం సాగిస్తూ అనారోగ్యంతో కన్నుమూశాడు. భార్య, కుమారుడు ఉన్నా అంత్యక్రియల కోసం ఆయన మృతదేహాన్ని తీసుకుని వెళ్లలేని పరిస్థితి. దీంతో మృతదేహాన్ని పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. కృష్ణా జిల్లా మొగల్రాజపురానికి చెందిన సంద్రంకి ఎర్రయ్య (60) మద్యానికి బానిసై 20 ఏళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అప్పటికే ఆయనకు భార్య నాగమణి, కుమారుడు వెంకటేష్ ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏనాడు భార్య, పిల్లల కోసం ఊరికి వెళ్లలేదు. గత కొంత కాలంలో సికింద్రాబాద్‌లోని ఫుట్‌పాత్‌పై ఉంటూ యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో అనారోగ్యంతో శుక్రవారం కీస్ హైస్కూల్ వద్ద ఫుట్‌పాత్‌పై అపస్మారక స్థితిలో ఉండగా గుర్తించిన పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అతని దగ్గర లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా తాము నిరుపేద కుటుంబానికి చెందిన వారమని మృతదేహాన్ని తీసుకుని వెళ్లే స్తోమత కూడా లేదని మీరే దహన సంస్కారాలు నిర్వహించుకోవాలని భార్య నాగమణి పోలీసులతో చెప్పడంతో గాంధీ మార్చురీకి తరలించారు.

నేటి నుంచి ఆస్తిపన్ను పరిష్కార మేళా


మాట్లాడుతున్న డీసీ సుభాష్‌రావు

సికింద్రాబాద్: ఈ నెల 3వ తేదీ నుంచి మార్చి నెలాఖరు వరకు ప్రతీ ఆదివారం ఆస్తిపన్ను మేళాను నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయాలనుకున్నారు. ఆస్తిపన్ను వసూళ్లు, సంబంధిత సమస్యల సత్వర పరిష్కారం కోసం శనివారం అధికారులతో డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఆస్తిపన్ను అపరాధ రుసుంలో 90 శాతాన్ని ప్రభుత్వం రద్దు చేసిన క్రమంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో రూ.26 కోట్ల ఆస్తిపన్ను వసూలు టార్గెట్ ఉండగా ఇప్పటికి రూ.18.5 కోట్లు వసూలు చేశామని మరో రూ.8.5 కోట్ల పన్ను బకాయిలను ఈ నెలాఖరులోగా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మోండా మార్కెట్‌లో అధికారులు, కార్పొరేటర్ పర్యటన


మోండా మార్కెట్‌లో పర్యటించిన కార్పొరేటర్ కొంతం దీపికా

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో శనివారం కార్పొరేటర్ కొంతం దీపిక, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, సూపర్‌వైజర్ ధనాగౌడ్, పర్యావరణ అధికారిణి తేజస్విని పర్యటించారు. అక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారాలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పారిశుద్ధ్యం, పశువుల సంచారం, అపరిశుభ్రమైన వాతావరణం గురించి కార్పొరేటర్ కొంతం దీపికా అధికారులకు వివరించారు. నిత్యం వందలాది మంది వివిధ రకాల కూరగాయలు, ఇతరత్రా వస్తువుల కోసం మార్కెట్‌కు వస్తుంటారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

త్వరలో టీపీటీ బకాయిల విడుదల

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) బకాయిల్లో రూ.48.55 కోట్లు త్వరలోనే విడుదల కానున్నాయి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జీవీ వెన్నెల తెలిపారు. స్థానిక కాంగ్రెస్ నేతలు మర్రి అమరేందర్ రెడ్డి, నాగేశ్‌తో పాటు సీఎంను కలిసి కంటోన్మెంట్‌కు సంబంధించిన సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ గతేడాది వరకు పెండింగ్‌లో ఉన్న టీపీపీ బకాయిలను తక్షణమే విడుదల చేయాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. దీంతో పాటు మరో రూ.25 కోట్ల పెండింగ్ బకాయిలు సైతం త్వరలోనే విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని సూచించినట్లు సమాచారం.

అదనపు నీటికీ ఆమోదం..

సుమారు 4 లక్షల జనాభా ఉన్న కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతానికి 5.9 ఎంజీడీల నీటిని మాత్రమే విడుదల చేస్తోంది. ఈ పరిమితిని 8.3 ఎంజీడీకి పెంచాలని కోరుతూ వెన్నెల సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. అదనపు నీటి విడుదలకు కంటోన్మెంట్ నుంచి కొత్తగా కనెక్షన్ ఛార్జీల పేరిట రూ.1 కోటి కోరడం సమంజసం కాదన్నారు. దీంతో పాటు పాత కనెక్షన్ ఛార్జీల బకాయి రూ.1 కోటి కూడా రద్దు చేయాలని కోరారు. కంటోన్మెంట్ జల మండలికి చెల్లించాల్సిన మంచినీటి బకాయిపై పెనాల్టీని రద్దు చేయాలని కూడా కోరగా ఆయా సమస్యలన్నింటిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెన్నెల పేర్కొన్నారు.

ప్రతీ ఆదివారం ఆస్తిపన్ను సమస్యల పరిష్కార వేదిక

సనత్‌నగర్: ఆస్తి పన్ను చెల్లింపు వివాదాలకు సంబంధించి ప్రతీ ఆదివారం పరిష్కార వేదికలను నిర్వహించనున్నట్లు బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ట్యాక్స్ అధికారులు, సిబ్బందితో శనివారం బేగంపేట సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఆస్తి పన్నుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 10, 17, 24, 31 తేదీల్లో (ప్రతీ ఆదివారం) సర్కిల్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ విషయంలో కూడా ఏవైనా సందేహాలు, సమస్యలకు సంబంధించి పన్ను చెల్లింపుదారులు పరిష్కారాలను పొందవచ్చని సూచించారు.

ఘనంగా సీఎంఏ సక్సెస్ మీట్



సాక్షి, సిటీ బ్యూరో: సికింద్రాబాద్ లోని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం సీఎంఏ సక్సెస్ మీట్–2024 నిర్వహించి డిసెంబర్ 2023 సీఎంఏ ఇంటర్ కోర్సులో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. చింతల తేజ దుర్గ మణికంఠ (13వ ర్యాంకు), అల్లా పద్మ లలిత(18), ఎం సుమిత్ కుమార్ రెడ్డి(21), బోస్ల కీర్తన(25), వైస్వామి వందిత కిశోర్ (45), సూర్య నారాయణ మూర్తి(50) ర్యాంకులు సాధించినట్లు అవినాష్ విద్యాసంస్థల చైర్మన్ డా.అవినాష్ బ్రహ్మదేవర అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో డీన్ సుశీల కందూరి, ప్రొఫెషనల్ కోర్సెస్ హెడ్ సీఏ గౌతమ్ జైన్, అవినాష్ కాలేజ్ ఎస్సార్‌నగర్ బ్రాంచ్ ప్రొఫెషనల్ కోర్సెస్ హెడ్ కృష్ణ కొరడా పాల్గొన్నారు.

సన్మానాలతో బాధ్యత మరింత పెరుగుతోంది



సనత్‌నగర్: కళాతపస్వి కే విశ్వనాథ్ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో యువ కళా వాహిని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మోడల్‌కాలనీ ఉపాధ్యక్షుడు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ శాయిని సన్మానించారు. శాయి చేస్తున్న సామాజిక సేవలకు హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్, సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావుల చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు.ఈ సందర్భంగా జేఎస్‌టీ శాయి మాట్లాడుతూ.. సన్మానాలు, అవార్డులు బాధ్యతను మరింత పెంచుతాయన్నారు.

వ్యక్తి అదృశ్యం


సహదేవ్‌సింగ్

రసూల్‌పురా:ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కార్ఖాన పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. న్యూ బోయిన్‌పల్లి పెద్దతోకట్టలో నివాసముండే సహదేవ్ సింగ్ (25) కార్ఖాన మసీదు సమీపంలోని మార్బుల్ షాప్‌లో పని చేస్తున్నాడు. రోజులాగే గత నెల 24న బావ విపిన్‌సింగ్‌తో మార్బుల్‌షాప్ వద్దకు పని చేసేందుకు వచ్చాడు. విపిన్‌సింగ్ వెళ్లిన గంట తర్వాత ములాయం సింగ్ అనే వ్యక్తి విపిన్‌సింగ్‌కు ఫోన్ చేసి నీళ్లు తాగేందుకు వెళ్లిన సహదేవ్‌సింగ్ రాలేదని సమాచారం ఇచ్చాడు. స్నేహితులు, బంధువులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎల్‌ఓసీ అందజేత



అడ్డగుట్ట: డివిజన్‌లోని ఏ–సెక్షన్ ప్రాంతానికి చెందిన పద్మావతి అనే మహిళ కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి విషయాన్ని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బాధితురాలికి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించగా చికిత్స నిమిత్తం రూ. 1.50 లక్షలు మంజూరయ్యాయి. శనివారం కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సీఎం సహాయనిధికి సంబంధించిన ఎల్‌ఓసీ పత్రాలను బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, మహ్మద్, రామస్వామి, నర్సింగ్ ఉన్నారు.

సాఫ్ట్ స్కిల్స్ పై ముగిసిన సదస్సు



ఉస్మానియా యూనివర్సిటీ: ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరికి సాఫ్ట్ స్కిల్స్ పై అవగాహన ఉండాలని ఓయూ అనుబంధ సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రవికుమార్ జాస్తి అన్నారు. శనివారం కాలేజీ ఆడిటోరియంలో హెచ్‌ఆర్‌డీసీ, పీజీ కాలేజీ ఆధ్వర్యంలో గత 14 రోజులుగా జరిగిన సాఫ్ట్ స్కిల్స్ అవగాహన సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపల్ ప్రొ.రవికుమార్ జాస్తి హాజరైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డా.మురళీధర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మృదుల, వెంకటేశం పాల్గొన్నారు.

4 ఉద్యోగాల బసవరాజుల రాజేష్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు చెందిన బసవరాజుల రాజేష్ ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించారు. ఇటీవల విడుదల చేసిన గురుకుల ఉద్యోగాలలో డిగ్రీ, జూనియర్ కాలేజీలలో లెక్చరర్‌తో పాటు పీజీటీ, టీజీటీ పాఠశాలలో టీచర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జగిత్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన రాజేష్ ప్రభుత్వం ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదివి ఇంగ్లిష్ సబ్జెక్టును ఆప్షన్‌గా ఎంపిక చేసుకొని ఒకేసారి నాలుగు ఉద్యోగాలను సాధించాడు.